ముమ్మరంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

- పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో నాలుగు బృందాలతో విచారణ
- నాలుగు గ్రామాల నుంచి మొత్తం 24,352 దరఖాస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)-2020 దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దఅంబర్‌పేట్, కుంట్లూర్, పసుమాముల, తట్టిఅన్నారం నాలుగు గ్రామాల్లో మొత్తం 24,352 మంది రూ. 1 వెయ్యి రుసుముతో నాలుగేళ్ల క్రితం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉన్నత అధికారుల ఆదేశాలతో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో అధికారులు దరఖాస్తుల పరిశీలనలో బిజీ అయ్యారు.


ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సైట్‌ను ఇన్‌స్పెక్షన్ చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్ తదితరులు

పరిశీలనకు ప్రత్యేకంగా టీంలు..

మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సైట్ ఇన్‌స్పెక్షన్ కోసం ఎల్-1 అధికారులతో కలిసి ప్రత్యేకంగా 4 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్క టీంలో ముగ్గురు అధికారుల(మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్)తో పాటు ఒక వార్డు అధికారిని కేటాయించారు. 24,352 దరఖాస్తులను నాలుగు గ్రామాల్లోని వార్డుల వారీగా 4టీంలకు విభజించారు. టీం-1కి 5,500, టీం-2కి 7,320, టీం-3కి 4,660, టీం-4కి 6,872 దరఖాస్తుల పరిశీలనకు కేటాయించారు. దరఖాస్తుల ఆధారంగా సైట్ విజిట్ చేసిన అధికారులు లేఔట్, ప్లాట్లకు సంబంధించి కోర్టు కేసులు, ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎలాంటి సమస్యలు లేని వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్, మార్కెట్ వాల్యూ ఆధారంగా ఎల్ఆర్ఎస్ ఫీజు ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతుందని అధికారులు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే మాత్రం వాటిని హోల్డ్‌లో పెడుతున్నట్లు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధతో పరిశీలన



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రతిరోజు నాలుగు టీంలు వారికి కేటాయించిన దరఖాస్తులను సైట్‌కు వెళ్లి పరిశీలిస్తున్నారు. క్లియర్‌గా ఉన్న దరఖాస్తులను అక్కడే యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వెంటనే దరఖాస్తుదారుడికి ఎల్ఆర్ఎస్ ఫీజు జనరేట్ అవుతుంది. రోజువారీ నివేదికను ఉన్నత అధికారులకు పంపిస్తున్నాం.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్‌ఫ్యాన్సీటాప్స్, డిజైనర్‌బ్లౌజ్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈసందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు మరో రెండు రోజులు మాత్రమే కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల, కార్పొరేటర్లు

రహదారి విస్తరణ పనులు నాణ్యతతో చేపట్టాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు చేపడుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణత్యా లోపాలు లేకుండా చేపట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం వనస్థలిపురం పనామా వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ పనులను కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డిలతో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో జాగ్రత్తలు తీసుకుని, నాణ్యతా లోపాలు లేకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా పటిష్ట ప్రణాళికతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రాండ్ జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎంఐఎం ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని గ్రాండ్ ఇంపీరియల్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన గ్రాండ్ జాబ్ మేళాను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులైన యువతీ, యువకులు తమ విద్యార్హతకు అనుగుణంగా ఉద్యోగాలను పొందేందుకే గ్రాండ్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పేరొందిన కంపెనీలు, మల్టీ స్పెషాల్టీ కంపెనీలు, మార్కెటింగ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, టెలీకాలర్ తదితర ఉద్యోగాల కోసం 3వేల మంది నిరుద్యోగులు పోటీపడ్డారు. వీరిలో 400 మంది ఉద్యోగావకాశాలు పొందారని ఎమ్మెల్యే వివరించారు. ఎంపికైన వారికి అక్కడే లెటర్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చావునీ, అక్బర్‌బాగ్ కార్పొరేటర్లు షాహిద్‌మూన్, మిన్హాజుద్దీన్, పార్టీ నాయకులు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్, సైఫుద్దీన్ షఫీ పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్

వనస్థలిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లు గుంతలుగా ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి రోడ్లను పరిశీలించి గుంతలను జేసీబీతో పూడ్చించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల తర్వాత రోడ్డు వేయించాలి

కొత్తపేట : డ్రైనేజీ పైప్‌లైన్ పనుల తర్వాత రోడ్డు వేయించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు నాగేశ్వర్‌నగర్ కాలనీవాసులు విన్నవించారు. కాలనీలో రోడ్డు పనుల కోసం దారిని తవ్వడంతో పాటు కంకర వేశారు. శనివారం కార్పొరేటర్ కాలనీకి రాగా కాలనీలో రోడ్డు పనుల తర్వాత డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడితే రోడ్డు పాడవుతుందని అధ్యక్షుడు రామ్‌నాథ్‌రెడ్డి, ప్రతినిధులు ఆయనకు వివరించారు. సమస్యను జలమండలి అధికారులకు విన్నవించామన్నారు.

ప్రియదర్శినికాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని ప్రియదర్శినికాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కల్మికొలన్ శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, కోశాధికారిగా ఆకవరం వెంకటరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సోమ్లానాయక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శంకర్‌తో పాటు మరికొంత మంది సలహాదారులు ఎంపికయ్యారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

మహిళా సాధికారతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి


మాట్లాడుతున్న అనసూయ

చాదర్‌ఘాట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలుగుతారని పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ అన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ మహిళ డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సుకు ఆమె ప్రధాన వక్తగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావాలని, అప్పుడే అన్ని రంగాల్లో తనకంటూ ప్రత్యేకతను సాధించగలుగుతారన్నారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ బాలచందర్, పీవోడబ్ల్యూ నాయకులు సుజాత, నవ్య, ప్రేమలత, కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణి పాల్గొన్నారు.

పల్లవి కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ డే

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్ఫోసిస్ సాప్ సీనియర్ కన్సల్టెంట్ శివప్రసాద్ కరాడి, సైంటిస్ట్ డాక్టర్ ప్రవీణ్ సామల, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ కందుకూరి రమేష్, డీఆర్‌డీఎల్ సీనియర్ సైంటిస్ట్ వీర మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల చైర్మన్ మల్కా కొమురయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్కా నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, డైరెక్టర్ రామ శేషగిరిరావు, ప్రోగ్రాం కన్వీనర్ రమ్య, రాజేందర్‌రెడ్డి, ఏవో శ్రీధర్, నవీన్‌కుమార్, సాయి, హరీష్, స్రవంతి, నవ్య, ప్రియవద పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి: పారిజాతారెడ్డి


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లోని ఆర్‌వీఆర్ కాలనీ, మారుతీనగర్ కాలనీల్లో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ముత్యాల లలితాకృష్ణతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈఈ వినీల్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్ సాయినగర్ కాలనీలో..

నాదర్‌గుల్ 19వ డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ రామోజీ అమితాశ్రీశైలంచారితో కలిసి మేయర్ పారిజాతారెడ్డి ప్రారంభించారు. మునిసిపల్ ఏఈఈ సాయిరామ్, నాయకులు సుభాన్‌యాదవ్, మనోహర్, పురుషోత్తంగౌడ్, భాను పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్ కాలనీలో..

నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పారిజాతానర్సింహారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈఈ బిక్కూనాయక్, కాలనీవాసులు శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

సరూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ ప్రైమరీ స్కూల్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు, ఇక్కడి నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కలిసి శనివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పని చేసినా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాలని అన్నారు. అనంతరం ఆమె పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

చంపాపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, పురేందర్‌రెడ్డి, జి.రజిత, అజిత, ఎస్.రజిత, వినయ్‌కుమార్, జ్యోతి, కావ్య పాల్గొన్నారు.

తొర్రూర్ మాజీ సర్పంచ్ అంజయ్య గుండెపోటుతో మృతి


మేకం అంజయ్య (ఫైల్)

హయత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తొర్రూర్ మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మేకం అంజయ్య శుక్రవారం రాత్రి గుండెపోటు తో మృతిచెందారు. ఆయనకు భార్య లక్ష్మీతో పాటు కుమారుడు ఉన్నారు. నెల రోజుల క్రితం ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. శుక్రవారం రాత్రి గుండెలో నొప్పిరావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంజయ్య 2006 నుంచి 2011వరకు తొర్రూర్ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2013 నుంచి 2018 వరకు తన భార్యను సర్పంచ్‌గా పోటీ చేయించి గెలిపించుకున్నాడు. 2007లో తొర్రూర్ గ్రామపంచాయతీ కేంద్ర ప్రభుత్వ నిర్మల్ పురస్కార్ అవార్డుకు ఎంపికయింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా సర్పంచ్ అంజయ్య అవార్డును అందుకున్నారు. అంజయ్య మృతి పట్ల ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకుడు సంరెడ్డి భుజంగరెడ్డి సంతాపం ప్రకటించారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి : చల్లా నర్సింహారెడ్డి


తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లోని ఏబీఆర్ కన్వెన్షన్‌లో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కోసం రూ.25కోట్లు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ నగరశివారులో ఉన్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధిలైట్లు కల్పించి నూరుశాతం మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, మంగమ్మ, కవిత, ఉదయశ్రీ, శిలింగంగౌడ్, అనురాధ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం సునీల్, ఇరిగేషన్ ఏఈ తస్వీర్ రజా, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలనీల రోడ్లపై గుంతలు పూడ్చాలి : రాజశేఖర్‌రెడ్డి


సమీక్షా సమావేశంలో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, ఉప కమిషనర్ జకియా సుల్తానా

ఎల్బీనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల నాటికి ప్రతీ కాలనీలో రోడ్లపై గుంతలు పూడ్చడంతో పాటు ఇతర సమస్యలు లేకుండా అన్ని విభాగాల అధికారులు చూసుకోవాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ జకియా సుల్తానాతో కలిసి వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై గుంతల వల్ల గణనాథుని విగ్రహాలు దెబ్బతినే ప్రమాదమున్నదన్నారు. రోడ్లన్నీ చెత్త నిండకుండా శుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లకుండా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. కాలనీలలో చెట్లు పెరగడం వల్ల విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని విద్యుత్ అంతరాయం లేకుండా కొమ్మలను కొట్టివేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్ఐ గంగాధర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ కార్తీక్, జలమండలి డీజీఎం సన్యాసిరావు, యూబీడీ మేనేజర్ సత్యనారాయణ, డీఈ (స్ట్రీట్ లైట్స్) శ్రీనివాస్, ఏఎంహెచ్ఓ నాగేష్‌నాయక్, ఏఈ (ఎంటమాలజి) మన్నమ్మ, ఏఈ(ఎలక్ట్రిసిటీ)నదీమ్, జీహెచ్ఎంసీ ఏఈ విజయ్‌కుమార్, జలమండలి ఏఈ పవిత్ర, ఏఈ(స్ట్రీట్‌లైట్స్) జగన్నాథం, సూపర్‌వైజర్ శ్రీకాంత్, పాపయ్య, హనుమంతు పాల్గొన్నారు.

వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశీరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చింతలకుంటలో ఈనెల 5న ఒంటరి వృద్ధురాలిని హత్య చేసి పరారీలో ఉన్న పాతనేరస్థుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషాకు చెందిన డోంబు బోత్రా అలియాస్ డుము(30) కొంత కాలంగా చింతలకుంటలోని శ్రీకృష్ణనగర్‌కాలనీలో అద్దెకు నివాసముంటు సెంట్రింగ్ లేబర్ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇదే కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలు బాలమ్మ(63) తన వద్ద ఉన్న డబ్బులను అప్పుడప్పుడు లెక్కపెడుతుండేది. ఇది గమనించిన నిందితుడు డోంబు బోత్రా వృద్ధురాలి వద్ద ఉన్న నగదును ఎలాగైనా దొంగిలించాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో ఈనెల 5న తెల్లవారు జామున వృద్ధురాలు బాలమ్మ ఉండే గదిలోకి వెళ్లి ఆమెను రాయితో హత్య చేసి ఆమె వద్ద ఉన్న 8వేల నగదు, వెండి వస్తువులను తీసుకుని పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 7తులాల వెండిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడిపై గతంలో పలు దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు ఏసీపీ తెలిపారు.

చట్ట విరుద్ధంగా విక్రయించే మందులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల పేరుతో చట్టవిరుద్ధంగా ఔషధాలను తయారు చేసి ప్రజలకు విక్రయిస్తున్న కేంద్రంపై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు శుక్ర, శనివారాల్లో దాడులు నిర్వహించి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆటోనగర్, బండ్లగూడ, నాగోల్ ప్రాంతాల్లో కిడ్నీ స్టోన్‌కి చికిత్సకు మందులు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి 12 చుక్కల మందులను ఆహార ఉత్పత్తులు, న్యూట్రాస్యూటికల్స్ పేరుతో తయారు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఇన్‌ఫెరా డ్రాప్స్, డిస్టోన్ క్యాప్సూల్స్ త్రిఫల చూర్ణం, డయాబెటిక్ చికిత్స చేస్తుందని విక్రయించే మందులను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. న్యూట్రాస్యూటిక్స్ పేరుతో తప్పుడు ప్రకటనలు చేస్తు ప్రజలను మభ్యపెడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఔషధ నియంత్రణ సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా ఈ విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. దీంతో సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో డబ్బులు వసూళ్లు

- తోడల్లుడే ప్రధాన నిందితుడు
- మాదన్నపేట పీఎస్‌లో ముగ్గురిపై కేసు

సైదాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో ఓ వ్యక్తిని బెదిరిస్తూ డబ్బు లు వసూలు చేసిన తోడల్లుడు. అతడి సహచరులపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. చావునీ నాదర్‌అలీ బేగ్‌కు చెందిన మహ్మద్ గౌస్(38)పై మార్చి నెలలో ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ లో చీటింగ్ కేసు నమోదై ఉంది. ఈ కేసులో అరెస్ట్ కాకుండా తాను చూస్తానని, తనకు పోలీస్ అధికారు లు తెలుసునని, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోవడానికి తిరుగుతున్నారని గౌస్‌ను అతడి స్వయాన తోడల్లుడు షబ్బీర్ అలీ నమ్మించాడు. ఇందుకు గౌస్ భయపడి గత 15 రోజులలో వాయిదాల పద్ధతిన రూ. 12,500 ముట్టచెప్పాడు. అయినా గురువారం షబ్బీర్ అలీ మరోసారి అతడి స్నేహితుడితో ఫోన్ చేయించి రూ.40వేలు ఇస్తేనే కేసు మాఫీ అవుతుందని, లేకుంటే టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇంటికి వచ్చి తీసుకువెళ్తారని బెదిరించారు.

తరువాత ఫోన్ చేసిన గంటకు ఇద్దరుగుర్తు తెలియని వ్యక్తులు గౌస్ ఇంటి వద్దకు వచ్చి వాకబు చేసి తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని. కేసు విచారణకు చెత్తబజార్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి రావాలని బెదిరించి వెళ్లారు. దీంతో గౌస్ భయంతో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లాడు. అక్క డి టాస్క్‌ఫోర్స్ అధికారులు తాము పిలువలేదని, వచ్చింది తమ పోలీసులు కాదని నిర్ధారించారు. డబ్బులు గుంజేందుకు తోడల్లుడు షబ్బీర్ పథకం ప్రకారం జరిగిందని గ్రహించి ఘటనపై మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరిట డబ్బులు డిమాండ్ చేసిన షబ్బీర్, సహచరులు సయ్యద్ మహ్మద్, గయాజ్‌లపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంజనేయ తత్వంపై ప్రవచనాలు

చంపాపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శత దేవాలయ ప్రవచన యాత్రలో భాగంగా నైమిషారణ్య పీఠం అధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈఓ ఎస్.లావణ్య వేద పండితులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో బాల బ్రహ్మానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆంజనేయ తత్వంపై ప్రవచనాలు చేశారు.

శ్రీనివాస కల్యాణ మహోత్సవం

ఎల్బీనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఇంటింటా శ్రీనివాస కల్యాణంలో భాగంగా శ్రీనివాస కల్యాణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణ శనివారం కొత్తపేట న్యూ మారుతీనగర్‌లో టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కటకం సుభాష్, పద్మజలు శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తిరునగరి నరేందర్ పౌరోహిత్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కల్యాణ వేడుకలకు పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, డాక్టర్ కాచం సత్యనారాయణగుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పున్న గణేష్‌నేత, గోల్కొండ మైసయ్య, నాగోల్ సుధాకరాచారి, డాక్టర్ విజయరంగ, ప్రవీణ్‌కుమార్, గట్ల రవీంద్ర, శ్రీధర్‌రాజ్, హనుమంతరావు, ఆనంద్ పాల్గొన్నారు.

మూసారాంబాగ్‌లో..

చాదర్‌ఘాట్ : శ్రావణ మాసం మూడో శనివారం పురస్కరించుకుని యతి సేవాశ్రమం ప్రధానార్చకులు వేద వాసాచార్యుల పర్యవేక్షణలో మూసారాంబాగ్‌లో సాయినగర్ కాలనీ నివాసి బి.ఇందిర కుటుంబ సభ్యులు శ్రీనివాసా కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజాచార్య చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులతో ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అభిషేక అర్చనల అనంతరం మధ్యాహ్నం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

స్ట్రోక్ సమ్మర్ స్కూల్-2024 శిక్షణ కార్యక్రమం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) ఆధ్వర్యంలో 'మిషన్ బ్రెయిన్ అటాక్' అనే అంశం ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం నగరశివారులోని రామోజీ ఫిల్మ్‌సిటీలో స్ట్రోక్ సమ్మర్ స్కూల్-2024 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్ సూర్య, కార్యదర్శి డాక్టర్. అరవింద్‌శర్మ, స్ట్రోక్ సమ్మర్ స్కూల్ కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ పి. విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల్ సూర్య మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చేందుకు బ్లడ్ ప్రెషర్, షుగర్, కొలెస్ట్రాల్ మూడు ప్రధాన కారణాలని తెలిపారు. ఈ మూడు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అరవింద్‌శర్మ, విజయ మాట్లాడారు. దేశవ్యాప్తంగా 34 నగరాల నుంచి ఎంపికైన సుమారు వంద మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు భద్రతా చర్యలు తీసుకోవాలి


ఎల్బీనగర్ : గణపతి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనం చేసేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఎల్బీనగర్ ప్రతినిధులు డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. శనివారం డీసీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా గణేశ్ ఉత్సవ సమితి ఏర్పాటు చేయనున్న స్వాగత వేదికకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు. డీసీపీని కలిసిన వారిలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు గంగం నవీన్, ఆకుల పవన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు అనిల్‌కుమార్ ఉన్నారు.

వివాహిత అదృశ్యం


సరోజా

అబ్దుల్లాపూర్‌మెట్: వివాహిత అదృశ్యం అయిన సం ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన జమేష్ అతడి భార్య సరోజా(అంజుమా 27) ఇనాంగూడ పరిధిలోని చాచా దాబా పక్కన ఉన్న ఓ గోదాంలో పని చేస్తోంది. కాగా ఈనెల 21న ఆమె భర్త జమేష్ గోదాం వద్దకు వెళ్లి ఆమెతో గొడవ పడ్డారు. అనంతరం అతడు ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి అయినా సరోజా ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఆమె కోసం బంధువుల, స్నేహితుల, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం అతడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి..


గీత

కొత్తపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సోదరుడి ఇంటి నుండి తమ ఇంటికి బయలుదేరిన గృహిణి అదృశ్యమైన సంఘటన నాగోల్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా జంగంమెట్‌లో ఉండే పరాశరం గీత(35) గృహిణి. ఈనెల 19న రాఖీ కట్టేందుకు జైపురికాలనీలో ఉండే సోదరుడు కుతాడి రాజు ఇంటికి వచ్చింది. తర్వాత ఈనెల 22న సాయంత్రం 4గంటలకు ఇంటికి వెళ్తానని చెప్పి ఆమె జైపురికాలనీలో ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. ఆమె ఇంటికి చేరలేదని అదే రోజు రాత్రి కుతాడి రాజుకు సమాచారం అందింది. దీంతో అతడు ఆమె ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువులనూ సంప్రదిస్తూ అంతటా వెతికినా ఫలితం దక్కలేదు. శుక్రవారం రాత్రి అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.